

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### పక్కలో బల్లెం

**"సారీ. నా వల్ల మీరు తెల్లారు ఝామునే** లేవాల్సి వచ్చింది" తన సూట్‌కేస్ అందుకుంటున్న మరిదితో గాయత్రి బిడియంగా చెప్పింది.

"పర్లేదండి. అదృష్టం. రైలు లేటవలేదు."

సురేంద్ర స్టేషన్ బయటకి నడిచాడు. గాయత్రి అతన్ని అనుసరించింది.

"అక్కా!" లిఫ్ట్ దగ్గరకి పరిగెత్తుకు వచ్చింది దేవిక.

"దేవీ కులాసానా? చిక్కినట్లున్నావే" ఆమెని ఆప్యాయంగా కౌగిలించుకుంటూ అడిగింది గాయత్రి.

"బాగున్నా అక్కా. రా. ప్రయాణం బాగా జరిగిందా?"

అప్పటికే దేవిక స్నానం పూర్తయిందని నుదుటన వున్న చిన్న కుంకుమ బొట్టు ముందు వైపు కొద్దిగా తడిసిన జుట్టు వల్ల తెలుస్తోంది. గాయత్రి చేతికి కాఫీగ్లాస్ ఇచ్చి హడావిడిగా చెప్పింది.

"ఆయనకి ఆఫీస్ టైమవుతోందక్కా. నువ్వు పేపర్ చూస్తూండు. లేదా టి.వి పెట్టుకో. పనయ్యాక కబుర్లు చెప్పుకుందాం."

"రైలు మరీ ఐదింటికే వచ్చింది. కాసేపు పడుకుంటా." గాయత్రి తనకి కేటాయించిన గదిలోకి నడిచింది.

గాయత్రి నిద్రలేచేసరికి పదకొండు దాటింది. ఒళ్ళు విరుచుకుంటూ బయటకి వచ్చింది. దేవిక వంటింట్లో ఏదో సర్దుతోంది.

"లేచావా? స్నానం చేసిరా. వంటయింది. అన్నం తినేద్దాం" చెప్పింది.

బట్టలకోసం గదిలోకి వెళ్ళబోతున్న గాయత్రి చెల్లెలు తర్వాత చెప్పిన మాటలు విని ఆగిపోయింది.

"మాకు నీళ్ళ ప్రాబ్లం ఎక్కువగా వుందక్కా!. స్నానం ఒక్కసారే. అతి పొదుపుగా వాడుకుంటున్నాం."

తిరిగి సోఫాలో కూర్చుంటూ చెప్పింది గాయత్రి.

"బద్ధకంగా వుంది. స్నానం సాయంత్రం చేస్తాను. అన్నం పెట్టెయ్యి"

దేవిక విచిత్రంగా చూసింది.

"నువ్వు స్నానం చేయకుండా అన్నం తిన్నావంటే పెదనాన్నకి కోపం వస్తుందక్కా. ఆయన మనల్ని ఎంత ఆచారంగా పెంచారు?"

"నా మొహంలే. ఆయనకి ఎవరు చెప్తారు? ఆకలేస్తోంది అన్నం పెట్టేయ్" గాయత్రి నిర్లక్ష్యంగా చెప్పింది.

భోజనాలయ్యాక బయట ఆరేసిన బట్టలు తెచ్చి మడత పెడుతూ అడిగింది దేవిక.

"మద్రాస్ విశేషాలేంటక్కా? బావగారు ఎలా వున్నారు? డుంబుగాడు నువ్వులేకపోతే ఏడవడూ?"

"మద్రాస్ ఎప్పట్లా బానే వుంది. బావ బ్రహ్మాండంగా వున్నారు. డుంబుగాడికి వాళ్ళ నాన్న వుంటే నేనక్కర్లేదు.... అవును నీ పెళ్ళయి మూడేళ్ళు దాటుతోంది. పిల్లలు గురించి ప్లాన్ చేయలేదా? "

దేవిక మొహంలో విషాద వీచికలు కనిపించాయి.

చేతిలోని చీరని వదిలేసి గాయత్రి పక్కన కూలబడుతూ చెప్పింది.

"మీ మరిదికి నా పొడే గిట్టడంలేదక్కా. నన్నసలు దగ్గరకే రానివ్వడంలేదు."

"అదేం?" అప్రయత్నంగా దూరంగా జరుగుతూ అడిగింది గాయత్రి.

"ఏమో! బానే మాట్లాడతారు. బానే తింటారు. అంతా సవ్యంగానే వుంది కానీ బెడ్‌రూంలోనే... నాకు దూరంగా అంచుకి జరిగి పడుకుంటారు. నిద్రలో కాలు, చేయి మీద పడినా విసిరికొడతారు. ఒక్కోసారి లేచి వచ్చి సోఫాలో పడుకుంటారు. చెప్పుకోడానికి నాకు అమ్మా నాన్నలేరు. పెదనాన్నంటే భయం. నువ్వు నీ ఫ్రెండ్ పెళ్ళికి హైదరాబాద్ వస్తున్నావంటే ఎంత సంతోషించానో అక్కా. నిజంగా నా అంత దురదృష్టవంతురాలు ఎవరూ వుండరు. " దుఃఖంతో ఆమె కంఠం వణికింది.

"సురేంద్రకి దురలవాట్లు ఏవైనా వున్నాయా?" ఆలోచనగా అడిగింది గాయత్రి.

"ఛఛ! ఆయన బంగారం నా రాతే బావుండలేదు. పొద్దునపూట ఒక్కోసారి తను చాలా మంచి మూడ్‌లో వుంటారు. కానీ నాకు అప్పుడు మూడ్ వుండదు. పనిమనిషి వస్తుందేమో, పాలుపొంగిపోతాయేమోలాంటి టెన్షన్స్. ఈ కారణంగానే అనుకుంటా. తను ఈ మధ్య ప్రతీదానికి అరుస్తున్నారు"

"ఐతే మనం డాక్టర్ సమరంగారిని కన్సల్ట్ చేయాలి." గాయత్రి నవ్వుతూ చెప్పింది.

కోపంతో, అవమానంతో దేవిక ముఖం ఎర్రబడింది.

"నా సమస్య నీకంత నవ్వులాటగా వుందా గాయీ?" అరిచింది.

"నేను వూరెళ్ళేలోగా నీ సమస్యకి పరిష్కారం చెప్పే వెళ్తా సరేనా?" గాయత్రి చెల్లెల్ని సముదాయించింది.

దేవిక చేత ఓ పాతికసార్లు చెప్పించుకుని సాయంత్రం ఆరుగంటలకి గాయత్రి స్నానానికి లేచింది. దేవిక ముఖం కడుక్కుని పౌడర్, బొట్టు, జడ అన్ని దిద్దుకున్నాక డ్రెస్ మార్చుకుని నైటీ వేసుకుని టి.వి చూస్తూ కూర్చుంది.

ఏడుదాటుతుండగా సురేంద్ర వచ్చాడు. మొహమాటానికి గాయత్రితో కొద్దిసేపు మాట్లాడి గదిలోకి వెళ్ళిపోయాడు. భోజనాల దగ్గరకూడా అతను ముభావంగానే వున్నాడు. దేవిక ఏం వడ్డించబోయినా 'నేను వేసుకుంటాను' అని తనే కావలసినవి వడ్డించుకున్నాడు.

మర్నాడు ఉదయమే గాయత్రి తయారై తన ఆఫీస్ కొలీగ్ పెళ్ళికి బయలుదేరింది

"అక్కా ఈరోజు ఆదివారమేగా. మనం సినిమాకి వెళ్దాం. తొందరగా వచ్చేయ్" దేవిక చెప్పింది.

"మేట్నీ కుదరదుకానీ ఫస్ట్ షోకి వెళ్దాం. నేనీ మధ్య ఏ తెలుగు సినిమా చూడలేదు కాబట్టి నాకేదైనా ఓ.కే" గాయత్రి ఒప్పుకుంది.

మధ్యాహ్నం రెండుగంటలకి గాయత్రి ఇంటికి వచ్చేసరికి దేవిక యధాప్రకారం వంటింట్లో ఏదో సర్దుతోంది. సురేంద్ర లాప్‌టాప్ చూసుకుంటున్నాడు. గాయత్రిని చూసి నవ్వి దాన్ని మూసి ఆమెతో మాట్లాడసాగాడు.

"ఏమండీ ఏ టైంకి బయలుదేరాలి? " దేవిక వంటింట్లోంచి అరిచింది.

"నాలుగున్నర."

"ఇంక రెండుగంటల టైం వుంది. ఈలోగా వంటచేస్తా" చెప్పింది.

"వద్దు దేవీ. బయట తినేసి వద్దాం. నాకు ప్రమోషన్ వచ్చిందిగా. మీకు ట్రీట్ ఇస్తాను" గాయత్రి చెప్పింది.

నాలుగ్గంటలకల్లా తయారై తన గదిలోకి వచ్చిన చెల్లిని చూసి గాయత్రి "ఈ డ్రెస్ బాలేదు. ఈరోజు నేను సెలక్ట్ చేయనా?" అడిగింది.

"బాలేదా? కొత్తది. రెండుసార్లే వేసుకున్నాను."

"ఐనా సరే. బాలేదు."

"సరేరా. నువ్వే చూసివ్వు" ఆమెని తన బీరువా దగ్గరకి తీసుకెళ్ళింది.

గాయత్రి అన్ని బట్టలూ పరిశీలించి ఓ డ్రెస్ తీసిచ్చి చెప్పింది.

"ఇది బావుంది."

"ఇదా? ఇది పాతది అక్కా. కాటన్‌ది"

"ఐనా సరే. ఇది బావుంది"

"ఓకే" దేవిక చిన్నగా నవ్వి దుస్తులు మార్చుకు వచ్చింది.

సినిమా అయ్యాక రెస్టారెంట్‌కి వెళ్ళి భోజనం చేసాక, గాయత్రి పక్కనే వున్న కిళ్ళీ షాపులో మూడు పాన్‌లు తీసుకుని ఇద్దరికీ చెరొకటి ఇచ్చింది. ఇంటికి వచ్చేదారిలో ఇంకా తెరిచి వున్న ఓ పూలబండి దగ్గర కారు ఆపించి జాజిపూలు కొన్నది. ఇంటికి వచ్చాక దాన్ని రెండు ముక్కలు చేసి ఒకటి చెల్లెలికిచ్చింది. ఆమె డ్రెస్ మార్చుకోబోతూంటే చెప్పింది.

"పాతది, కాటన్‌ది అన్నావుగా. వుంచుకో మళ్ళీ ఏం మారుస్తావు దాన్నికూడా."

దేవిక ఆ ప్రయత్నం విరమించి అక్కకి గుడ్‌నైట్ చెప్పింది.

మర్నాడు సురేంద్ర ఆఫీస్‌కి వెళ్ళాక నిద్రలేచిన గాయత్రి కాఫీ అందించిన చెల్లెలితో చెప్పింది.

"నేను సాయంత్రం వెళ్ళిపోతున్నాకదా? నీ పనులు కట్టి పెట్టి కొద్దిసేపు కబుర్లు చెప్పుకుందాం రా"

దేవిక బుద్ధిగా అక్క పక్కన కూర్చుంది.

"రాత్రి సురేంద్ర నీతో బానే వున్నాడుగా?"

దేవిక ముఖంలో చిరుసిగ్గు.

"నీ సమస్యకి కారణం నువ్వే. ఇలా చెప్తున్నందుకు ఏమీ అనుకోవద్దు. దేవీ." ఆమె భుజం మీద చెయ్యివేసి అనునయంగా చెప్పింది.

"నేనా? నేనేం చేసాను? ఇల్లు తీర్చిదిద్దుతాను. వంట బాగా చేస్తాను. బయటకే వెళ్ళను తీసుకెళ్ళమని అడగను..." దేవిక నివ్వెరబోతూ చెప్పింది.

"నిజమే వీటన్నిటితోపాటు శారీరక శుభ్రంగా కూడా వుండాలిగా?"

"ఏంటీ? నువ్వు స్నానం చేయకుండా అన్నం కూడా తింటావు. నేను కాఫీ కూడా తాగను తెలుసా?" ఉక్రోషంగా అడిగింది.

అదేమీ పట్టించుకోనట్లుగా గాయత్రి అడిగింది.

"డియోడరెంట్స్ అనే పేరు ఎప్పుడైనా విన్నావా?"

అప్పటికే దేవిక మొహం ఎర్రబడింది.

"మా డ్రెస్సింగ్ మిర్రర్ దగ్గర చూడు ఎన్ని వున్నాయో. మావారు ఆఫీస్‌కి వెళ్ళేప్పుడు వేసుకుంటారు." రోషంగా చెప్పింది.

"మరి నువ్వెందుకు వేసుకోవు?"

"నాకెందుకు ఇంట్లోనే వుంటాగా?" తెల్లబోయింది.

"అదే నువ్వు చేసే పొరపాటు. పొద్దున లేవగానే స్నానం చేస్తావు. ఆ తర్వాత పని. పనిమనిషి వున్నా నువ్వే చాదస్తంగా సగం పని చేస్తున్నావు. సాయంత్రం మొహం కడుక్కుని పౌడర్ రాసుకుంటావు. కానీ నీవంటికి పట్టిన చెమట? పగలంతా నైలాన్ డ్రెస్‌లు, రాత్రి పూట పాలియస్టర్ నైటీలు అవేమి చెమటని పీల్చవు. నువ్వు వాటిని సరిగ్గా ఉతకవు"

"ఒక్కోటి రెండు రోజులు వేసుకుంటాను మార్చి మార్చి. చెప్పాగా నీళ్ళ కరువు"

"ఇదొక వంక, నేను అదనంగా వస్తే నాకు స్నానానికి ఓ బక్కెట్ నీళ్ళు ఇచ్చావుగా? నా బట్టలు వుతికించావుగా? ఏమీ అనుకోకు కానీ దేవీ నీ నుంచి ఎంత దుర్వాసన వస్తుందో తెలుసా? చెమట వాసన. భయంకరమైన చెమటవాసన. నిన్న నువ్వు సినిమాకి వేసుకున్న డ్రెస్ దూరం నుంచే ఎంతకంపు కొట్టిందో. ఇది మూడోసారి వేసుకోడం అన్నావు. అంటే రెండుసార్లు వేసుకున్నా దాన్ని వుతకలేదు. అందుకనే నిన్ను వుతికిన కాటన్ డ్రెస్ వేసుకోమన్నాను. నీ బీరువా తెరవగానే కూడా గుప్పున చెమట వాసన. నీ మంచం మీది దుప్పటికూడా పోలియస్టర్‌దే దానికీ నీ వాసన పట్టింది. నాకు తెలిసి దాన్ని నెలకోసారి ఉతుకుతావు. పాపం సురేంద్ర మంచివాడు కాబట్టి సున్నితమైన విషయం నీకు ఎలా చెప్పాలో తెలీక దూరంగా వుంటున్నాడు. పొద్దున్నే నువ్వు స్నానం చేసాక కొద్దిగా సన్నిహితంగా వుందామనుకుంటే, పాలు, పనిమనిషి అని తాపత్రయపడతావు. నీ పక్కన కూర్చుని టి.వి చూడడు అన్నావు. నువ్వు చేతులు కదిలించినప్పుడల్లా ఎంత దుర్వాసనో తెలుసా? అందుకే వడ్డించడానికి కూడా ఒప్పుకోవడం లేదు. నీ పక్కన పడుకోవడమే గ్రేట్." గాయత్రి ఆవేశంగా చెప్పింది.

దేవిక కళ్ళు నిండుకుండల్లా వున్నాయి.

"నీ తెలుసుకదక్కా. చిన్నప్పటినుంచి నాకు చెమట ఎక్కువ" గొణిగింది.

"నీలో లోపం నీకు తెలిసినప్పుడు దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయచ్చుగా? సినిమా అనగానే పెర్ఫ్యూమ్ వేసుకుని బయలుదేరావు. ఇంట్లో డియోడరెంట్స్ వాడచ్చుగా? సాయంత్రం కనీసం అర బక్కెట్ నీళ్ళతో స్నానం చేయచ్చుగా? మైసూర్ శాండల్ లాంటి స్ట్రాంగ్ వాసన వుండే సోప్ వాడచ్చుగా? మీ ఇంటి పక్కనే పూలబండి. రోజుకి ఓ పదిరూపాయల మల్లెపూలో జాజిపూలో కొనుక్కోవచ్చుగా? ఏమీ చేయకుండా సురేంద్రని ఎందుకు బ్లేమ్ చేస్తావు? ఇల్లు శుభ్రంగా వుండటం, వంట బాగా చేయడం, వడియాలు బాగా పెట్టడమే కాదు. మగాడికి ఇంకా చాలా కావాలి 'నీ పక్కన కూర్చుని టివి చూడచ్చుగా' అని నువ్వనుకున్నట్లుగా, నాతో కూర్చుని కబుర్లు చెప్పచ్చుగా అని అతను అనుకోడా? ముందు ఆ దిక్కుమాలిన నైటీలు, డ్రెస్‌లు పారెయ్. కాటన్‌వి కొనుక్కో. నీటి కరువు అని ఈ ఇంట్లో ఎందుకు వుండటం? మరో మంచి చోటుకి మారండి. బెడ్‌రూంలో దుప్పట్లు కనీసం వారానికోసారి మార్చు. ఎప్పుడూ వంటగదిలో పడి డబ్బాలు సీసాలు సర్దుకోడం మాని అతనితో కబుర్లు చెప్పు. ముఖ్యంగా స్నానం చేయగానే డియోడ్రెంట్ వేసుకోడం మర్చిపోకు."

గాయత్రి చెల్లెలి భుజం మీద చెయ్యివేసి అభిమానంగా చెప్పింది.

"దేవీ. నీ మంచి కోసమే ఇంత కఠినంగా చెప్తున్నాను. అపార్థం చేసుకోకు."

"ఛ! లేదక్కా. డిగ్రీ చదివాను కానీ ఇంత చిన్నవిషయమే తట్టలేదు నాకు. పాపం ఆయన్ని అపార్థం చేసుకున్నాను." దేవిక తేటగా చెప్పింది.

"ఇది చిన్న విషయం కాదు. చాలా పెద్ద విషయం. చాలామంది ఆడవాళ్ళు వూళ్ళోవాళ్ళు చూడటానికి పట్టుచీరలు, సిల్క్ చీరలు కట్టుకుని, మేకప్ చేసుకుని వెళ్తారు. ఇంటికి రాగానే అవి మార్చి వెలిసిపోయిన పాత నైటీ వేసుకుని, ముఖానికి నూనె రాసి మేకప్ చెరిపేసి పూలుతీసి రేపు పొద్దున పెట్టుకోవచ్చని బాక్స్‌లో పెట్టి ఫ్రిజ్‌లో పెడతారు. ఇలాంటి వాళ్ళని ఎంతమందిని చూసానో. పాపం ఆ భర్తలు మాత్రం భార్యలని అందంగా చూడాలనుకోరా చెప్పు? బయట రంభలా మెరిసిపోయిన భార్య వెలిసిపోయి పక్కమీదకి చేరుతుంది. ఇక మగాళ్ళకి వాళ్ళమీద ఏం ఆసక్తి వుంటుంది చెప్పు?" గాయత్రి నవ్వుతూ అడిగింది.

వారం తర్వాత గాయత్రికి దేవిక నించి ఇ మెయిల్ వచ్చింది. 'అక్కా! నీ సూచనలన్నీ ఆచరణలో పెట్టాను. పాత నైటీలు, డ్రెస్‌లు పారేసి రాత్రిపూట కూడా మెత్తటి కాటన్ చీరలు కట్టుకుంటున్నాను. 'నీ నడుం చూసి ఎన్నాళ్ళయింది' అని సురేంద్ర ముచ్చట పడుతున్నారు. ఆఫీస్ నుంచి రాగానే ముచ్చట్లు కూడా చెప్తున్నారు. సాయంత్రాలు స్నానం చేస్తున్నాను. మల్లెపూలు కొంటున్నాను. ఇంకో వార్త ఏమిటంటే నీళ్ళ కొరతలేని ఇంటికి, అద్దె కొంచెం ఎక్కువైనా మారిపోతున్నాం. నువ్వు భగవంతుడు పంపినట్లుగా వచ్చావు. ఇంకొన్ని రోజుల ముందు వచ్చి వుంటే ఇంకా బావుండేది. **ప్రేమతో దేవి.**'

'**చాలా సంతోషం దేవీ.** 'స్వీయలోపమ్ములెన్నుట గొప్ప విద్య' అని నీ లోపం నువ్వు తెలుసుకున్నావు. సుఖనిద్రకి, సుఖసంసారానికి రాత్రి పూట స్నానం మంచిదని తెలుసుకో, సురేంద్రకి కుదిరినప్పుడు మా ఇంటికి రండి (ఇక్కడి వేడికి నువ్వు రోజుకి నాలుగుసార్లు స్నానం చేయాలి)

**ఆల్ ది బెస్ట్. ప్రేమతో అక్క.**

రిప్లై పంపింది గాయత్రి.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story